క్లుప్తంగా

నేడు 2కే రన్

కల్వకుర్తి టౌన్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సోమవారం 2కే రన్ నిర్వహించనున్నట్లు ఎస్‌ఐ రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. పట్టణంలోని బస్టాండ్ వద్ద ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి రన్ ప్రారంభమవుతుందని చెప్పారు. యువకులు, విద్యార్థులు, పట్టణ ప్రజలు 2కే రన్‌లో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నీటి సమస్య పరిష్కారం



కోడేరు: మండల కేంద్రంలోని 4వ వార్డులో 'మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయాలి' అనే శీర్షికన 'సాక్షి'లో ఆదివారం ప్రచురితమైన కథనానికి ఎంపీడీఓ శ్రవణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి రవితేజ స్పందించి చర్యలు చేపట్టారు. వెంటనే వాటర్‌మెన్ లక్ష్మయ్య, కారోబార్ సాయిబాబు కాలనీలో పర్యటించి మిషన్‌భగీరథ పైపులైన్ చూసి సమస్య పరిష్కరించి తాగునీటిని వదిలారు.

రాంరెడ్డిపల్లి వాసికి పీహెచ్‌డీ



తెలకపల్లి: మండల పరిధిలోని రాంరెడ్డిపల్లికి చెందిన విద్యావేత్త అసిస్టెంట్ ప్రొఫెసర్ వేముల శ్రీనివాసులుకు ఉస్మానియా యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణలో మద్యం వినియోగానికి ప్రేరణ కారకాలు, తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన భద్రతా చర్యలు అనే అంశంపై శ్రీనివాసులు పరిశోధన చేశారు. ఆయన 4 సంవత్సరాల పరిశోధనా కాలం పూర్తయింది. అందుకు గాను ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి వాణిజ్య శాస్త్రంలో పీహెచ్‌డీ పట్టాను అందించినట్లు ఆదివారం గ్రామస్తులు, శ్రీనివాసులు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణలో మద్యం వినియోగం తీరు, కారకాలపై 4 సంవత్సరాలు అధ్యయనం చేసి పూర్తి సమాచారాన్ని సేకరించినందుకు గౌరవ పీహెచ్‌డీ డాక్టరేట్‌ను అందిస్తున్నారన్నారు. ఆయన ప్రస్తుతం హైదరాబాద్‌లోని మల్కాజ్‌గిరి డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారని, ఆయనకు పీహెచ్‌డీ పట్టా రావడంపై గ్రామస్తులు ఆయన మిత్రులు అభినందనలు తెలియజేశారు.

ధర్నాను విజయవంతం చేయండి



చారకొండ: ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లో ఇందిరాపార్కు వద్ద రాజ్యాంగంపై అవగాహన, పౌరుల హక్కుల్ని విస్తృతంగా ప్రచారం చేయాలని డిమాండ్ చేస్తూ.. ధర్మ సమాజ్ రాష్ట్ర కమిటీ నిర్వహిస్తున్న కార్యక్రమానికి మండలం నుంచి ధర్మ సమాజ్ పార్టీ నాయకులు, అభిమానులు భారీగా హాజరై విజయవంతం చేయాలని కోరారు. మండల కేంద్రంలో ఆదివారం ధర్నా కరపత్రాలను విడుదల చేశారు. ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల ప్రచారకులు మల్లేష్ మాట్లాడారు. రాజ్యాంగంలో ఆర్టికల్ 3 ద్వారా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని ప్రచారం చేసి, పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని డిమాండ్‌చేశారు. మొగులయ్య, పరశురాం, శంకర్, రమేష్, శ్రీను, అజయ్, ప్రశాంత్, శంకరయ్య, వెంకటయ్య, శివ పాల్గొన్నారు.

మైసమ్మ జాతరకు భక్తుల రద్దీ



పెద్దకొత్తపల్లి: నాయినోనిపల్లి మైసమ్మ దేవత వద్దకు ఈ ఆదివారం భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు, రైతులు, వ్యవసాయ కూలీలు ప్రభుత్వ ప్రైవేట్ వాహనాల్లో తరలివచ్చారు. వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు కూలీలు అదే విధంగా మృగశిర కార్తె రావడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ వారం దాదాపు 6 వేల మంది భక్తులు హాజరైనట్లు ఎండోమెంట్ అధికారి బాబురావు తెలియజేశారు.

రోడ్డు నిర్మాణం చేపట్టండి

కల్వకుర్తి రూరల్: మండలంలోని తర్నికల్ నుంచి ఎల్లికట్ట వరకు బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంతో రహదారి అస్తవ్యస్తంగా మారింది. ఈ రోడ్డు 3 గ్రామాల ప్రజల రాకపోకలకు అనువుగా ఉంటుంది. ఎల్లికట్ట, వెంకటాపూర్, తర్నికల్ గ్రామాల పరిధిలోని రైతులకు, ప్రజలకు ఈ రోడ్డు సౌకర్యంగా ఉంటుంది. ప్రధానమైన రోడ్డును బీటీ రోడ్డుగా మారుస్తామని ఎన్నికల హామీలకే నాయకులు పరిమితం కావడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సొంత భవనాలు ఏవీ?

- అద్దె గదుల్లో గ్రామపంచాయతీల సేవలు
- సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మహిళలు



మండలంలోని పద్మన్నపల్లిలో అంగన్‌వాడీ కేంద్రంలో కొనసాగుతున్న గ్రామపంచాయతీ

లింగాల: రాష్ట్ర ప్రభుత్వం రెండో సారి అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామపాలన ప్రజలకు మరింత చేరువలో తీసుకెళ్లేందుకు కొత్త గ్రామపంచాయతీలను ఏర్పాటు చేసింది. లింగాల మండలంలో 13 గ్రామపంచాయతీలు ఉండగా.. కొత్తగా మరో 10 పంచాయతీలను ఏర్పాటు చేయగా.. నేడు గ్రామ పంచాయతీల సంఖ్య 23కు చేరుకుంది. క్యాంపురాయవరం, కొత్తచెర్వుతండా, అప్పాపూర్‌పెంట, దత్తారం, మల్లొనిచెర్వుతండా, శ్రీరంగాపూర్, రాంపూర్, బాకారం, పద్మన్నపల్లి, మగ్దూంపూర్ కొత్త పంచాయతీలుగా ఏర్పాటు చేశారు. కాని కొత్త గ్రామపంచాయతీలు ఏర్పాటై 4 సంవత్సరాలు గడుస్తున్నా.. సౌకర్యాలు మాత్రం అంతంత మాత్రంగానే ఉన్నాయి.

- మండలంలో నూతనంగా ఏర్పాటైన గ్రామపంచాయతీలకు నేటికీ సొంత భవనాల నిర్మాణాలు చేపట్టలేదు. కొత్తగా పంచాయతీలు ఏర్పాటు చేసిన తర్వాత అంగన్‌వాడీ కేంద్రాలు, ఇతర భవనాల్లో పంచాయతీలను కొనసాగిస్తూ.. వస్తున్నారు. మండలంలోని అన్నిపంచాయతీలకు పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. కాని సౌకర్యాలు లేకపోవడంతో పాలనాపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కనీస సౌకర్యాలు కరువు

మండలంలో కొత్తగా ఏర్పడిన గ్రామపంచాయతీలకు సొంత భవనాలు లేకపోవడం, ఉన్న భవనాల్లో కనీస సౌకర్యాలు లేక మహిళా కార్యదర్శులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ముఖ్యంగా సమావేశం మందిరాలు లేకపోవడం, మరుగుదొడ్లు, మూత్రశాలలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని జీల్గుపల్లి పంచాయతీ భవన నిర్మాణం ఏడేళ్ల నుంచి అసంపూర్తిగానే ఉంది. రచ్చకట్ట వద్ద సమావేశాలు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది.

ఇసుకను తోడేస్తున్నారు

- పట్టించుకోని యంత్రాంగం

తాడూరు: మండలంలోని మేడిపూర్, పొలుమూరు, ఆకునెల్లికుదురు, అంతారం, ఎటిదారిపల్లి, సిర్సవాడ, పాపగల్లు గ్రామాలను అనుసరించుకుని పారుతున్న దుందుభీ వాగులోంచి రాత్రి పగలు తేడా లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. అధికారుల చర్యలు అంతంతమాత్రమే ఉండడం, అధికార పార్టీ నాయకుల అండ దండలతో రెచ్చిపోతున్నారు. గతంలో ఈ ప్రాంతం నుంచి ఇసుక వెళ్లాలంటే రైతులు ఐక్యంగా ఉండి ఎక్కడకూ వెళ్లకుండా గ్రామాల్లో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ప్రస్తుతం మూడేళ్ల నుంచి అక్కడక్కడ ఇసుకను తరలించడం ప్రారంభించారు. మండలంలోని ఎటిదారిపల్లి నుంచి రాత్రిళ్లు ఇసుకను తరలించడం, ఒక వేళ పోలీసులకు చిక్కినా ప్రజాప్రతినిధులతో ఫోన్ల ద్వారా అధికారులను బెదిరించడంతో వారు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. మేడిపూర్ వద్ద ఇసుక రీచ్ ఏర్పాటు చేసి వందల టిప్పర్లు తోడేశారు. ప్రభుత్వ నిబంధనలు తుంగలో



పొలాల్లో ఏర్పాటు చేసిన ఇసుక డంపులు



ఇసుకను తోడేందుకు సిద్ధంగా ఉన్న పొక్లెయిన్

తొక్కి కాంట్రాక్టర్ ఇసుకను తరలించారు. రెండు రోజుల నుంచి మేడిపూర్‌లో ఇసుకపై గ్రామంలో అలజడులు జరిగాయి. శనివారం ఏకంగా వాగులో పొక్లెయిన్ ఏర్పాటు చేసి టిప్పర్ల ద్వారా ప్రభుత్వ భవనాల పేరు చెప్పి అక్రమంగా తరలిస్తుండగా గ్రామస్తులు పట్టుకున్నారు. మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి సైతం అక్రమంగా తరలిస్తున్న టిప్పర్లను డంపులను పరిశీలించి పోలీస్‌స్టేషన్‌లో టిప్పర్‌ను తరలిస్తే పోలీసులు తమకు సంబంధం లేదంటూ రెవెన్యూ కార్యాలయ ఆవరణలో ఉంచారు. ఎవరు అనుమతించారో కానీ ఇసుక టిప్పర్ మరుసటి రోజే వెళ్లిపోయింది. ఈ విషయమై ఎస్పీకి ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులు తెలిపారు.

ఎక్కడ చూసినా డంపులే..

సందట్లో సడేమియా మాదిరిగా గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ట్రాక్టర్ల ద్వారా గ్రామం నుంచి పొలుమూరుకు వెళ్లే రోడ్డుకు ఇరుపక్కల ఆయా రైతుల పొలాల్లో ఇసుక నిల్వలు చేసుకున్నారు. వారి సమయానుకూలంగా తిరిగి ఇసుకను తరలిస్తున్నారు.

వనపట్ల సుబ్బయ్యకు సన్మానం



సన్మానం పొందుతున్న వనపట్ల సుబ్బయ్య

కందనూలు: తెలంగాణ భాషా సంస్కృతిక శాఖ, తెలంగాణ సాహిత్య అకాడమి ఆధ్వర్యంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన తెలంగాణ సాహిత్య దినోత్సవం సందర్భంగా జిల్లాకు చెందిన కవి వనపట్ల సుబ్బయ్య, హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కవి సమ్మేళనంలో పాల్గొని 'దసరా సంబురాల్లా దశాబ్ది ఉత్సవాలు' కవితాగానం చేశారు. అనంతరం కార్యక్రమ ముఖ్యఅతిథి, తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు జూలూరి గౌరీశంకర్, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, అకాడమీ కార్యదర్శి బాలాచారి, సభాధ్యక్షుడు జూపాక సుభద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవి వనపట్ల సుబ్బయ్యను శాలువా, నగదుతో సన్మానించారు.

కల్వకుర్తి కవికి పురస్కారం



కల్వకుర్తి రూరల్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలో నిర్వహించిన తెలంగాణ సాహిత్య దినోత్సవాల్లో కల్వకుర్తికి చెందిన కవి శ్రీనయ్య గౌడ్ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ ఉత్సవాల్లో ఆయన 10 సంవత్సరాలుగా ప్రభుత్వం అమలు చేసిన మిషన్ కాకతీయ, కల్యాణలక్ష్మి, దళితబంధుపై తన కవితలను వినిపించారు. శ్రీనయ్యగౌడ్‌కు రూ.1,116 నగదుతో పాటు ప్రశంసాపత్రం అందించి జిల్లా అదనపు కలెక్టర్ మనూచౌదరి, డీఆర్‌డీఓ నర్సింగరావు శాలువాతో సన్మానించారు.

తాగునీటికి ఇక్కట్లు

ఉప్పునుంతల: మండలంలోని గువ్వలోనిపల్లిలో వారం రోజులుగా విద్యుత్ సరఫరాలో అంతరాయంతో తాగునీటి సరఫరా నిలిచిపోయి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మిషన్ భగీరథ నీరు కూడా రావడంలేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పక్క గ్రామపంచాయతీ లత్తీపూర్ నుంచి గ్రామపంచాయతీ ట్యాంకర్‌తో సరఫరా చేస్తున్న కొద్దిపాటి నీటితో కాలం వెల్లదీస్తున్నారు. ఈ నెల 7న భారీగా వీచిన గాలివానకు గ్రామానికి చెందిన నిరంజన్ వ్యవసాయ పొలంలో మూడు 11 కేవీఏ విద్యుత్ స్తంభాలు విరిగిపడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గ్రామస్తులు ఒత్తిడి తేవడంతో గ్రామంలో విద్యుత్ సరఫరా పునరుద్ధరించిన ట్రాన్స్‌కో సిబ్బంది, తాగునీటి బోర్లు, వ్యవసాయ బోర్లకు మాత్రం కరెంట్ సరఫరాను పునరుద్ధరించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని గ్రామస్తులు సైదులు, నిరంజన్, వెంకటయ్య తదితరులు



గువ్వలోనిపల్లిలో ట్యాంకర్‌తో సరఫరా చేస్తున్న నీటిని పట్టుకుంటున్న మహిళలు

ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్తంభాలు విరిగిపడిన స్థానంలో పాతదానికి కొత్త స్తంభాలు తీసుకొచ్చి, పొలంలో వేసిన సిబ్బంది, వాటిని పాతకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. తాను పొలంలో పత్తి విత్తనాలు నాటుకోవడానికి ఇబ్బందిగా మారిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటికైనా విద్యుత్ ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించడానికి కృషి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కర్రలే విద్యుత్ స్తంభాలు



తెలకపల్లి: రైతులు తమ పొలాల్లో బోరుమోటార్లకు విద్యుత్ స్తంభాలు లేక కర్రలకే విద్యుత్ వైర్లు బిగించుకున్నారు. రైతులు డీడీలు చెల్లించినా అధికారులు రైతులకు సరిపడా విద్యుత్ మెటీరియల్‌తో పాటు విద్యుత్ స్తంభాలు ఇవ్వకపోవడంతో కర్రలు నాటి వాటిపైన విద్యుత్ తీగలు బిగించుకున్నారు. ప్రస్తుతం గాలివానలకు కర్రలు విరిగిపడి, తీగలు తెగిపడి, ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం రైతు పొలాలో స్తంభాలు లేక కర్రలకు బిగుంచుకున్న విద్యుత్ తీగలు వేలాడుతుండటంతో ప్రమాదం పొంచి ఉంది. అధికారులు విద్యుత్ స్తంభాలు, వైర్లు అందివ్వాలని రైతులు కోరుతున్నారు.

5 వేల యూనిట్ల దళితబంధు ఇవ్వాలి



గుంతకోడూరులో నిరసన వ్యక్తం చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

తాడూరు: ప్రభుత్వం అమలు చేస్తున్న దళితబంధు పథకం నియోజకవర్గానికి 5వేల యూనిట్లు ఇవ్వాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కాశన్న డిమాండ్‌చేశారు. ఆదివారం మండలంలోని గుంతకోడూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. దళితబంధు అర్ధరాత్రి చీకటి ఒప్పందాల ద్వారా వారి అనునాయులకు పల్లెంలో ఫలహారంగా పంచుకుంటున్నారని ఆరోపించారు. అధికారుల ద్వార పారదర్శకంగా ఎంపిక చేసి నియోజకవర్గానికి 5 నుంచి 10 వేల యూనిట్లు ఇవ్వాలన్నారు. ఎంపిక బాధ్యత కలెక్టర్లకు అప్పగించాలన్నారు. గ్రామంలో ఒక్కరికి మాత్రమే దళితబంధు రావడంతో మిగిలిన పేదలందరికీ రాకపోవడంతో ఐక్యమత్యంగా ఉన్న కుటుంబాల మధ్య ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయన్నారు. రూ.17,700 కోట్లతో దళితులందరికీ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. దళితులకు మూడెకరాల భూమి అటకెక్కిందన్నారు. వాగ్దానాలకే పరిమితం తప్పా.. ప్రస్తుతం ఎన్నికల్లో గెలవాలనే ఉద్దేశంతో బీసీలకు రూ.లక్ష అంటూ కులాల మధ్య చిచ్చుకు తెరలేపారన్నారు. బడుగు బలహీన వర్గాలపై జరుగుతున్న అన్యాయాలపై పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కేవీపీఎస్ జిల్లా నాయకులు నరసింహ, చంద్రయ్య, సైదులు, మణ్యం, బంగారయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే రైతులకు మేలు



కల్వకుర్తి రూరల్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే రైతు సంక్షేమం జరుగుతుందని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం భగత్‌సింగ్ తండాలో గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తే వచ్చే విడతలో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తుందన్నారు. రూ.500కు పేద వారికి గ్యాస్ సిలిండర్ అందిస్తామని సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ అధ్యక్షుడు జగన్, శేఖర్, సైదులు యాదవ్, కరన్, దాస్యానాయక్ తదితరులతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కేఎల్‌ఐ కల్వర్టు

లింగాల: లింగాల నుంచి కొత్తకుంటపల్లి వెళ్లే మార్గంలోని కేఎల్‌ఐ కాల్వపై నూతనంగా నిర్మించిన కల్వర్టు ప్రమాదకరంగా మారడంతో వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. నూతనంగా నిర్మించిన కల్వర్టుల పనుల్లో నాణ్యత పాటించకపోవడం, నాసిరకం పనులు చేయడంతో ప్రమాదం పొంచి ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కల్వర్టుపై సీసీ వేయకపోవడంతో వానలకు గుంతలు ఏర్పడి బురదయంగా మారింది. కల్వర్టుకు నిర్మించిన రక్షణ గోడ దగ్గర రోడ్డు కోతకు గురైంది. చిన్నపాటి వర్షాలకు అంచులు కోతకు గురికావడంతో మున్ముందు కురిసే భారీ వర్షాలకు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం



లింగాల నుంచి కొత్తకుంటపల్లి మార్గంలో ప్రమాదకరంగా మారిన కల్వర్టు

ఉందని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత కాంట్రాక్టర్ కల్వర్టుకు మరమ్మతు పనులు చేపట్టాలని, సీసీ పనులు చేయించాలని కోరుతున్నారు.

ఉమ్మడి కుటుంబాన్ని కలిపిన 'బలగం'



మొక్కలు నాటుతున్న కుటుంబ సభ్యులు

కల్వకుర్తి రూరల్: నేటి సమాజంలో ఒకే ఇంటి వారు ఎవరికి వారే నివాసం ఉంటూ ఉమ్మడి కుటుంబం అనే ఊసే లేకుండా పాయింది. ఉమ్మడి కుటుంబం అనేది అరుదుగా మారిపోయింది. మనుషులు, కుటుంబాల మధ్య అనుబంధాలు, ఆప్యాయతలు ఆవిరైపోతున్నాయి. ఇలాంటి సమయంలో 'బలగం' సినిమా చాలా మంది కుటుంబాల్లో ఆలోచన రేకెత్తిచ్చింది. మండలంలోని ఎల్లికట్టకు చెందిన శంకరమ్మ, వెంకట్‌నారాయణ చారికి చెందిన వంశం సభ్యులు 150 మంది ఆదివారం ఒకే చోటికి చేరుకుని కలుసుకున్నారు. ఈ కుటుంబం సమ్మేళనం గ్రామస్తులను ఆకట్టుకుంది. చాలా సంవత్సరాల తరువాత ఒకే చోట చేరిన కుటుంబ సభ్యులు సందడి చేశారు. వీరంతా హైదరాబాద్, నల్లగొండ, రంగారెడ్డి, నాగర్‌కర్నూల్, వనపర్తి, మహబూబ్‌నగర్ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. వీరంతా ఒకే చోట చేరి ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. ఆడిపాడారు. తమ కలయికకు గుర్తుగా వారి పొలం చుట్టూ 199 మొక్కలను నాటి నీరు పోశారు. గత స్మృతులను నెమరు వేసుకున్నారు. దంపతులను సన్మానించారు. మొత్తం మీద శంకరమ్మ, వెంకటనారాయణ చారిల కుటుంబ సభ్యులు చాలా సంవత్సరాల తరువాత ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకుని అందరి ప్రశంసలు అందుకున్నారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం



వెల్దండ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1998 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులు, ఆనాటి ఉపాధ్యాయులకు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం పూర్వ విద్యార్థులు పాఠశాల దశలోని అంశాలను చర్చించారు. 25 ఏళ్ల తరువాత విద్యార్థులు కలవడంతో వివిధ అంశాలను చర్చించారు.

నిర్మించి వదిలేశారు



వృథాగా ఉన్న సమాఖ్య భవనం



నిరుపయోగంగా ఉన్న డ్వాక్రా భవనం

తాడూరు: ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి ఓ లక్ష్యంతో నిర్మించిన ప్రభుత్వ భవనాలు శిథిలావస్థకు చేరడంతో పాటు నిరుపయోగంగా మారాయి. ప్రభుత్వాధికారులు వాటి నిర్వహణపై ఏమాత్రం శ్రద్ధ కనబరచకపోవడంతో రాజుల సొమ్ము రాళ్లపాలు మాదిరిగా తయారైంది. మండలంలో దాదాపు రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన ప్రభుత్వ భవనాలు ఎందుకూ పనికిరాకుండా పోయాయి. ప్రతిరోజూ భవనాలను అధికారులు చూస్తూ వెళ్తున్నారు. వాటి ఉపయోగం గురించి ఇటు అధికారులు, అటు ప్రజాప్రతినిధులు ఆలోచించడంలేదు. ఇక మండల కేంద్రం పరిస్థితి ఇలా ఉంటే.. గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించిన కమ్యూనిటీ భవనాలు, యువజన సంక్షేమ శాఖకు సంబంధించిన భవనాలు, మహిళా సంఘాల భవనాలు వృథాగా ఉన్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ వహించి నిరుపయోగంగా ఉన్న భవనాలకు మరమ్మతు చేపట్టి ఉపయోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బహిరంగ చర్చకు సిద్ధమా

నాగర్‌కర్నూల్ రూరల్: నల్లమట్టి దందాకు బీఆర్‌ఎస్ పార్టీకి ఉన్న సంబంధాన్ని నిరూపిస్తామని, అందుకు ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి బహిరంగ చర్చకు సిద్ధమా అని బీఎస్పీ నాగర్‌కర్నూల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొత్తపల్లి కుమార్ సవాలు విసిరారు. ఆదివారం ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ పతనం నాగర్‌కర్నూల్ నుంచే ప్రారంభమైందని, కేసీఆర్ సభను పట్టించుకోని ఉమ్మడి మహబూబ్‌నగర్ ప్రజలకు ధన్యవాదాలు చెబుతున్నామన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల గురించి మాట్లాడకుండా బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించుకుని వెల్లడం సిగ్గుచేటని విమర్శించారు. సీఎం కేసీఆర్ ఎమ్మెల్యే గువ్వల అతివినయం ప్రదర్శించారని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డిని ప్రజలు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఆయన సీఈఓ అని చెప్పుకోవడం దుర్మార్గమన్నారు. భారత రాజ్యాంగాన్ని చట్టాలను ఎమ్మెల్యే చదువుకుంటే బాగుంటుందని సూచించారు. నల్లమట్టి దందాలో అవినీతి లేదని చెబుతున్న ఎమ్మెల్యే మాటలను బీఎస్పీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఎప్పుడు ఎక్కడ చర్చకు వస్తారో ఎమ్మెల్యే తెలపాలని కోరారు. రానున్న ఎన్నికల్లో బహుజనులంతా ఏకమై బీఎస్పీకి మద్దతు ఇవ్వాలని కోరారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కారంగి బ్రహ్మయ్య, అసెంబ్లీ ఇన్‌చార్జ్ పృథ్వీరాజ్, మహేష్ యాదవ్, కళ్యాణ్, లక్ష్మణ్ దాస్, వెంకటేష్, బాలనాగులు, మొగులాల్, జగన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొత్తపల్లి కుమార్

జటప్రోల్ జలపాతంలో.. జనం సందడి

కొల్లాపూర్: నియోజకవర్గంలోని పెంట్లవెల్లి మండలం జటప్రోల్ సమీపంలోని జలపాతం జనంతో కిక్కిరిసిపోయింది. ఆదివారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు పెద్దసంఖ్యలో జలపాతం వద్దకు వచ్చారు. కత్వ నుంచి నీళ్లు దిగువకు దూకే క్రమంలో జలపాతం రూపంలో కనువిందు చేస్తుంది. ఇక్కడ స్నానం చేస్తూ.. ఉల్లాసంగా గడిపేందుకు జనం ఆసక్తి చూపుతున్నారు.



ప్రాచీన కట్టడాలు.. గత చరిత్రకు ఆనవాళ్లు


ఉప్పునుంతల: ప్రాచీన కట్టడాలు గత చరిత్రకు ఆనవాళ్లుగా నిలుస్తున్నాయి. చోళుల కాలం నాడు మండలంలో గచ్చుతో నిర్మించిన మామిళ్లపల్లి ఆలయ గోపురం నేటికి చెక్కుచెదరకుండ ఉంది. ఉప్పునుంతల తదితర గ్రామాల్లో ఎన్నో ఏళ్ల కిందట రాజులు నిర్మించిన కోట బురుజులు, ఆలయాలు ఇప్పటికీ పటిష్టంగా ఉండటం వారి ప్రతిభ, పట్టుదలను నేటి తరాల వారికి గుర్తుచేస్తున్నాయి.

లక్ష్మీనరసింహస్వామి దేవాలయం

మండలంలోని మామిళ్లపల్లిలో లక్ష్మీనరసింహస్వామి దేవాలయం పూరాతనమైంది. చోళుల కాలం నిర్మించిన ఈ ఆలయానికి మంచి చరిత్ర ఉంది. నాడు గచ్చుతో నిర్మించిన ఆలయ గోపురం నేటికి చెక్కుచెదరకుండ ఉంది. గోపురంపై చెక్కిన బొమ్మలు చూపరులను ఆకర్షిస్తాయి. ఇప్పటికీ ఆలయానికి సంబంధించిన 400 ఎకరాల వరకు దేవుని మాన్యం భూములు ఆయా గ్రామాల్లో ఉన్నాయి. ఆ భూములను లీజుకు ఇవ్వగా వచ్చిన డబ్బులతో స్వామి వారికి దూపదీప నైవేద్యాలు అందుతున్నాయి. ప్రతియేటా పాల్గుణ శుద్ధ ఏకాదశి మొదలుకొని పాల్గుణ బహుళ విధియ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు.

కోట బురుజులు

వందల ఏళ్ల కిందట ఈ ప్రాంతాలను పాలించిన రాజుల కాలం చరిత్రను నేడు గ్రామాల్లో శిథిలావస్థలో కన్పిస్తున్న కోట బురుజులు గుర్తుచేస్తున్నాయి. ఈ క్రమంలోనే ఉప్పునుంతల మండల కేంద్రంలో నాలుగు కోట బురుజులు ఉన్నాయి. అందులో మూడు పూర్తిగా శిథిలమై కనుమరుగు కాగా గ్రామ కూడలిలో ఉన్న కోట బురుజు మాత్రం నేటికి ఒక్క పక్క పడిపోయినా మరో పక్క మాత్రం చెక్కు చెదరకుండా ఇప్పటికీ పటిష్టంగా ఉంది. మండలంలోని కాంసానిపల్లి, పెద్దాపూర్‌లో ఉన్న కోట బురుజులు మాత్రం పూర్తిగా శిథిలమై పునాదిలో వాడిన రాతి కట్టడాలు మాత్రం కనిపిస్తున్నాయి. అప్పట్లో రాజుల సంస్థానాలు ఉండే కోటలకు శత్రు రాజుల నుంచి రక్షణ కోసం నలుదిక్కుల మట్టితో నిర్మించిన ఎత్తైన బురుజులు నిర్మించేవారని పెద్దలు చెబుతున్నారు. బురుజులపై రక్షణగా ఉండే సైన్యం వాటికి అమర్చిన గూనల ద్వార దూరంగా వచ్చే వారిని గమనిస్తూ అప్రమత్తంగా ఉండేవారని అంటున్నారు. కాలక్రమేనా రాజుల పాలన అంతరించిపోయి అప్పట్లో వారు నిర్మించిన కట్టడాలు మాత్రం శిథిలావస్థలో ఉండి నేటి తరానికి అప్పటి చరిత్రలను గుర్తుకు చేస్తున్నాయి.



ఉప్పునుంతలలో కోటబురుజు